తీరిన రహ'దారి'ద్ర్యం

- 40 సంవత్సరాల అనంతరం రోడ్ల నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న బ్రహ్మానందపురం ప్రజలు



బ్రహ్మానందపురం సచివాలయం నుంచి నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్

తాడేపల్లి రూరల్: ఎట్టకేలకు మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం గ్రామస్తుల రోడ్డు కష్టాలు తీరాయి. 40 సంవత్సరాల నుంచి సరైన రహదారి లేక అవస్థలు పడ్డారు. చెప్పులు అరిగేలా రాజకీయ నాయకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. చివరకు మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో వారి కష్టాలకు తెరపడింది. ప్రధాన రహదారితో పాటు నివాసాలకు వెళ్లే రహదారుల్ని సైతం నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 40 లక్షలతో అనుసంధాన రోడ్డు నిర్మాణం

తాడేపల్లి పట్టణ పరిధిలోని పాత, కొత్త జాతీయ రహదారుల మధ్య వున్న బ్రహ్మానందపురానికి ప్రధానంగా మూడు రహదారులు ఉన్నాయి. ప్రకాష్‌నగర్ రైల్వేట్రాక్ కింద నుంచి, నులకపేట గుంటూరు చానల్ నుంచి బొగ్గిళ్ల మీదుగా, హైవే మీదున్న వడ్డేశ్వరం దగ్గరున్న ఎయిమ్స్ హాస్పిటల్ మీదుగా దారులు ఉన్నాయి. ఎమ్మెల్యే ఆర్కే చొరవతో ఎయిమ్స్ హాస్పిటల్ నుంచి అటవీ శాఖ నుంచి అన్ని అనుమతులు తీసుకుని డబుల్ రోడ్డు నిర్మించారు. రహదారి వెంబడి వీధిలైట్లు కూడా ఏర్పాటు చేశారు. అనంతరం నులకపేట నుంచి ఫారెస్ట్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం రూ. 40 లక్షలతో ఆ రెండు రహదారుల్ని కలుపుతూ నివాసాల మధ్యకు వచ్చే ప్రధాన రహదారిని బీటీ రోడ్డుగా నిర్మిస్తున్నారు.

గతంలో నానా అవస్థలు పడ్డాం



మా చిన్నప్పటి నుంచి ఇక్కడే నివాసముంటున్నాం. ఇక్కడ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉన్నప్పుడు బ్రహ్మానందపురం నుంచి బయటకు వెళ్లేందుకు రోడ్డు బాగానే ఉండేది. ఫ్యాక్టరీ మూసేసిన అనంతరం తవ్వేయడంతో గత 20 సంవత్సరాల నుంచి సరైన రోడ్డు లేక నానా అవస్థలు పడ్డాం. ముళ్ల పొదల్లో నుంచి నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. గతంలో బ్రహ్మానందపురానికి బైపాస్ రోడ్డు నుంచి మట్టి రోడ్డు ఉండేది. అందులోనే రాకపోకలు సాగించేవాళ్లం. ఇప్పుడు డబుల్ రోడ్ వేసి లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు. – మేకల ధనలక్ష్మి

వర్షం వస్తే బురద మయం



వర్షం పడితే నివాసాల మధ్య తప్పా అన్ని రోడ్ల మీద నీళ్లు నిలబడేవి. ఎమ్మెల్యే ఆర్కే బ్రహ్మానందపురాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఊర్లోకి వచ్చే ప్రతి రహదారిని నిర్మించి వీధి దీపాలు కూడా వేశారు. ఇప్పుడు మా పిల్లలు అర్ధరాత్రి రావాలన్నా ఇంటికి ఒక్కరే వస్తున్నారు. గతంలో ఊర్లోకి రావాలంటే ఎవరైనా తోడు ఉండాల్సి వచ్చేది. ఫారెస్ట్‌లోంచి జంతువులు బయటకు రాకుండా ముళ్లకంచె ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆర్కే చొరవతోనే ఈ పనులు పూర్తయ్యాయి. – దాసి సునీత

ఎమ్మెల్యే ఆర్కే చొరవతో అభివృద్ధి



నా చిన్నప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నా. వర్షం వస్తే సిమెంట్ ఫ్యాక్టరీ వారు నిర్మించిన సీసీ రోడ్డు మీద అడుగు లోతు నీళ్లు ఉండేవి. ఆ నీళ్లలో పాములు తిరుగుతూ ఉండేవి. చుట్టూ ముళ్ల చెట్లు ఉండేవి. బైపాస్ రోడ్‌కు మోకాలు లోతు గుంతల్లో వెళ్లాల్సి వచ్చేది. అడవి పందులు, కొండచిలువలు కనబడేవి. ఎమ్మెల్యే ఆర్కే పుణ్యమా అంటూ రూ. 8కోట్లు ఖర్చు పెట్టి బ్రహ్మానందపురానికి వివిధ అభివృద్ధి పనులు చేశారు. ఇప్పుడు అంబేడ్కర్ బొమ్మ వద్ద కూడా బీటీ రోడ్ నిర్మించడం ఎమ్మెల్యే ఆర్కే చొరవే. – యస్‌కే. జావిద్

క్లుప్తంగా

నేడు చేనేత మగ్గం షెడ్ల ప్రారంభోత్సవం

మంగళగిరి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద నూతనంగా నిర్మించిన చేనేత మగ్గాల షెడ్లను సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరై, చేనేత మగ్గాల షెడ్లను ప్రారంభించనున్నట్లు తెలిపింది. కార్యక్రమంలో నేత కార్మికులు, చేనేత ఉప ఉత్పత్తుల కార్మికులు, చేనేత వ్యాపారస్తులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆర్కే కార్యాలయ వర్గాలు కోరాయి.

వీరాంజనేయుడికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడులో గల వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి అర్చకులు చింతలపాటి హనుమంతురావు, లక్ష్మీనారాయణ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పెరుకలపూడి ఎస్సీ కాలనీకి విద్యుత్ వెలుగులు



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని పెరుకలపూడి ఎస్సీ కాలనీవాసులు వీధి లైట్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇటీవల గ్రామంలో పర్యటించిన సందర్భంగా కాలనీవాసులు వీధిలైట్లు కావాలని కోరడంతో స్పందించిన ఆయన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. ఎస్సీ కాలనీకి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆర్కే ఆదేశాల మేరకు ఆదివారం కాలనీలో కొత్తగా విద్యుత్ స్తంభాల్ని ఏర్పాటు చేసి వీధి లైట్లను ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కత్తులపేటలో కార్డన్ సెర్చ్



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కత్తులపేటలో ఆదివారం సాయంత్రం సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తాడేపల్లి పశువుల హాస్పిటల్ దగ్గర నుంచి కత్తులపేటకు వెళ్లే బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. తాడేపల్లి ఎస్‌ఐలు వినోద్‌కుమార్, రమేష్, శ్రీనివాసరావు, గిరిబాబు తదితరులు టీమ్‌లుగా విడిపోయి కత్తుల పేటకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి, లోపలి వ్యక్తులు బయటకు రాకుండా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వేర్వేరు ప్రాంతాల నుంచి పలువురు వచ్చి నివాసముంటున్నారన్నారు. ఎవరు ఏం చేస్తున్నారో తెలుసుకునేందుకు ప్రతి ఇంటిలో తనిఖీలు చేపట్టామని ఆయన తెలిపారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాల్ని కూడా సీజ్ చేస్తున్నామని చెప్పారు. తనిఖీలు పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

కార్మెల్ మాత దర్శనానికి తరలివచ్చిన భక్తులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొండపై కొలువై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయాన్నే రైళ్లు, బస్సులు, వాహనాల్లో కడప, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, రాయవరం ప్రాంతాల నుంచి వచ్చారు. కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నిడమర్రులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిడమర్రుకు చెందిన కట్లగుంట గోపాలకృష్ణ బైక్ మెకానిక్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదాయం అంతగా లేకపోవడంతో కొంతకాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఆదివారం పక్కా సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి తొమ్మిది క్వార్టర్ సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి రూరల్ ఎస్‌ఐ క్రాంతి కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాటలతో ఉద్యమ స్ఫూర్తి నింపిన గద్దర్

ఎమ్మెల్యే ఆర్కే సంతాపం

మంగళగిరి: విప్లవ కవి, రచయిత, ప్రజా గాయకుడు గద్దర్ ఆకస్మిక మృతిపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తాడిత, పీడిత వర్గాల ప్రజల్లో తన పాటలతో ఉద్యమ స్ఫూర్తిని నింపిన పోరాట యోధుడు గద్దర్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీపీఐ, ప్రజానాట్యమండలి నివాళి

నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ, ప్రజా నాట్యమండలి, ఏఐఎస్‌ఎఫ్ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుతయ్య, జాలాది జాన్‌బాబు, దారా గురునాథం, గౌహర్ జాని, ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ శివ గోపి, కోకన్వీనర్ అభిషేక్, పట్టణ అధ్యక్షుడు ఆళ్లమూడి హనోక్ పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

ధార్మిక జ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరం

ఇమామ్ ఇబ్నేబాజ్ రబ్బానీ

మంగళగిరి: ధార్మిక జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, దాని ద్వారానే సమాజంలో గౌరవ మర్యాదల్ని పొందవచ్చని ఇమామ్ ఇబ్నేబాజ్ రబ్బాని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం మస్జీద్-ఎ-మొహమ్మద్‌లో శనివారం రాత్రి నిర్వహించిన ఇస్లాం ధార్మిక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జ్ఞానం అనేది దైవ ప్రవక్తల సొత్తు అని, ధార్మిక విద్య నేర్చుకున్న వారు ప్రవక్తల వారసులని చెప్పారు. సమాజంలో గౌరవ మర్యాదలు పొందాలంటే ఖురాన్ జ్ఞానం కలిగి ఉండాలన్నారు. నేడు సమాజంలో కొందరు పేరుకే ముస్లింలుగా జీవిస్తున్నారని, ఇస్లాంతో వారి సంబంధమే లేదన్నట్లుగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. జ్ఞానం నేర్చుకుని పంచాలని, తద్వారా జ్ఞానుల స్థాయిని అల్లాహ్ పెంచుతాడని చెప్పారు. కార్యక్రమంలో ఇమామ్ ఇబ్నేబాజ్ ఉస్మాన్, మస్జీద్-ఎ-మొహమ్మద్ ఇమామ్ ఫయాజ్ ఆలం పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఇమామ్ ఇబ్నేబాజ్

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మంగళగిరి: నగరంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోకి ఎవరు వెళ్లినా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా కల్యాణ మండపంలో తరచూ జరిగే శుభ కార్యక్రమాలకు సమీపంలోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు భోజనాలు చేసేందుకు వస్తుంటారు. గమనించిన శుభకార్యాల నిర్వాహకులు వారిని వెంబడించే క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెనుకకు వెళ్లి దాక్కుంటున్నారు. దానికి రక్షణ కంచె లేకపోవడంతో పిల్లలు ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



మణిపూర్‌లో మారణ హోమాన్ని నిరసిస్తూ శాంతి ర్యాలీ

మంగళగిరి: మణిపూర్ మారణ హోమాన్ని నిరసిస్తూ ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం పరిశుద్ధ పౌలు లూథరన్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. తొలుత లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ పారిశ్రామికవాడ మీదుగా వేప చెట్టు, రామాలయం సెంటర్, పెనుమాక రోడ్డు మీదుగా తిరిగి లూథరన్ చర్చి వద్దకు చేరింది. కార్యక్రమంలో పాస్టర్ స్టాన్లీబాబు, సంఘ పెద్దలు సాలి లాజర్, ఆంద్రు దుర్గా ప్రసాద్, భట్టు విజయసాగర్, డి. కిరణ్, దాసరి యోహాన్ రాజు, శిఖా ఆనంద్ పాల్గొన్నారు.

కేంద్రం సత్వరమే చర్యలు తీసుకోవాలి

పొన్నెకల్లు(తాడికొండ): మణిపూర్ మారణకాండపై కేంద్రం సత్వరమే చర్యలు తీసుకోవాలని పొన్నెకల్లు పాస్టర్స్ సంఘ కాపరులు కోరారు. తాడికొండ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పలు గ్రామాల నుంచి పాస్టర్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ కాలనీ నుంచి తెలుగు బాప్టిస్టు చర్చి వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో చర్చిల్ని ధ్వంసం చేయడంతో పాటు స్త్రీలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి చంపుతుంటే ప్రభుత్వాలు మిన్నకుండా చూస్తూ ఉండిపోవడం మారణ హోమానికి ఊతమివ్వడం కాదా? అని ప్రశ్నించారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

వెంకటపాలెంలో పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

- ఆరుగురు వ్యక్తుల అరెస్టు
- రూ.1,62,800 స్వాధీనం



సీఐ ఎం. ఆనందరావు

తాడికొండ: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ ఎం. ఆనందరావు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వెంకటపాలెం పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.1,62,800తో పాటు ఆరు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐకమత్యంతో అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి




సదస్సులో మాట్లాడుతున్న కన్వీనర్ మిల్లు బాబు

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్డులోని రవీంద్ర హోటల్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల ముస్లింల సమైక్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ కన్వీనర్ షేక్ మిల్లు బాబు మాట్లాడుతూ అంతా సమైక్యంగా ఉంటూ ముస్లింలలో పేద కుటుంబాల ఉన్నతికి పాటుపడాలని కోరారు. పేద విద్యార్థుల చదువుకు, యువతల పెళ్లిళ్లకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి వైద్య సాయానికి ఆర్థిక చేయూతనందించాలని సూచించారు. ముస్లింల ఏరియాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ హబీబుల్లా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ముస్లింలంతా అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. ఇతరులకు సహాయం చేసే గుణం ప్రతి ఒక్కరూ ఆచరణలో చూపాలని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ హజ్ కమిటీ మెంబర్ ముఫ్తి అబ్దుల్ బాసీద్ సాహెబ్, ముఫ్తి మహ్మద్ ఆసిఫ్ సాహెబ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ జిలాని, షేక్ ఫజుల్లా, మంగళగిరిపాడు గ్రామ సర్పంచ్ షేక్ రబ్బాని, బేతపూడి సర్పంచ్ షేక్ మస్తాన్ వలి, మునగపాడు సర్పంచ్ షేక్ బాజి, షేక్ మస్తాన్, రస్సు హుస్సేన్, షేక్ గఫూర్, షేక్ గాలిబ్, చంటి బాజి, ముస్లిం మైనార్టీ సెల్ మాజీ నాయకులు దర్గా అబ్దుల్లా, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

అమ్మభాషలో రాణిస్తేనే ఇంగ్లిష్‌పై పట్టు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ అమరావతి ఐకాన్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న సులభంగా ఇంగ్లిష్ నేర్చుకుందాం శిక్షణ తరగతి ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాస్టర్ పాగోలు రాజు మాట్లాడుతూ వేగంగా పరిగెడుతున్న ప్రపంచంతో పోటీగా విద్యార్థులు పరిగెత్తాలని సూచించారు. మాతృభాషలో రాణిస్తేనే ఇంగ్లిష్‌లోనూ రాణిస్తారని వివరించారు. నేర్చుకోవాలనే తపన ఉన్న విద్యార్థులు ఎప్పటికీ ముందంజలో ఉంటారని తెలిపారు. ప్రతి విద్యార్థిలో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్ని వెలికితీయడం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల బాధ్యతని సూచించారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ అవసరమైనా అమ్మ భాషకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. తెలుగులో బాగా మాట్లాడగలిగితేనే ఇంగ్లిష్ చక్కగా మాట్లాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వాహకులు యడ్ల బాలకృష్ణ, ఈదర రాజశేఖర్, రియాజ్ బాష, సురేంద్ర, నాగరాజు, వై. సుబ్బారావు, షితిజ, పీఈటీ రమేష్, పిన్నమనేని విజయ పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

జమాతే ఇస్లాం ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాల పంపిణీ

మంగళగిరి: జమాతే ఇస్లాం మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని జమ్ జమ్ హోటల్ ఎదుట ఉచితంగా పుస్తకాల్ని పంపిణీ చేశారు. ఖురాన్, ఇస్లామిక్ తెలుగు సాహిత్యం పుస్తకాలను అడిగిన ప్రతి ఒక్కరికీ కులమతాలకు అతీతంగా అందించారు. ఇస్లాం ధార్మిక అవగాహన కల్పించేందుకు, ప్రజల్లో మత సామరస్యం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జమాతే ఇస్లాం మంగళగిరి శాఖ ప్రతినిధులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంగళగిరి: నగరంలోని జగనన్న కాలనీ టిడ్కో సముదాయం వద్ద నిర్మిస్తున్న విద్యుత్ ఉప కేంద్రానికి 33 కేవీ లైన్ ఏర్పాటు నిమిత్తం సోమవారం ఉదయం 7:30 గంటల నుంచి 9:30 సరఫరా నిలిపి వేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని నిడమర్రు రోడ్డు దక్షిణ భాగం ఆర్‌ఆర్ టవర్స్ వైపు నుంచి టిప్పర్ల బజారు, మార్కండేయ కాలనీ, ఆటోనగర్‌లతో పాటు రాజీవ్ గృహకల్ప, టిడ్కో గృహ సముదాయాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: ఉచిత మెగా వైద్య శిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సూచించారు. కార్పొరేషన్ పరిధి యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల ఆవరణలో బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించిందన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు దాతలు కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందుల్ని పంపిణీ చేసిన బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా విభాగం సభ్యుల్ని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. బీసీ వెల్ఫేర్ జేఏసీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొడాలి ఉమారాణి మాట్లాడుతూ మంగళగిరి పట్టణ, పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అడిగిన వెంటనే సేవలందించేందుకు ముందుకు వచ్చిన వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైద్యులు డాక్టర్ సత్య ఫణీంద్ర, డాక్టర్ కె. సతీష్‌కుమార్, డాక్టర్ డి. శారద, డాక్టర్ శ్వేత, డాక్టర్ ఎస్‌కే సైదావలి, డాక్టర్ సీహెచ్. నరేష్, బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా కార్యదర్శి ముదిలి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. నాగేశ్వరి, కోదాడ సత్యప్రసాద్, కె. ధనలక్ష్మి, బి. లక్ష్మి, సీహెచ్. శ్రీదేవి, నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థికి, చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత కత్తిక రాఘవరావు తదితరులు



ఎమ్మెల్యే ఆర్కే తరఫున విద్యార్థిని పుష్పశ్రీకి ఆర్థిక సాయాన్ని జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు తదితరులు

తాడేపల్లి రూరల్: విద్యార్థికి, చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత అందించారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో అద్దె బండ్లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కత్తిక రాఘవరావు చేతులమీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా కత్తిక రాఘవరావు మాట్లాడుతూ వడ్డేశ్వరంలో నివాసముంటున్న అమృతపూడి నాగదేవి, జాజం యాంకోజిల అద్దె బండ్లపై కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వచ్చిన డబ్బులు బండికి అద్దెలు చెల్లించడానికే సరిపోతున్నాయని తెలిపారు. వారి సమస్యను మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా మంచి మనసుతో స్పందించిన ఆయన సొంత ఖర్చులతో తోపుడు బండ్లు తయారు చేయించి అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కత్తిక మల్లికార్జునరావు, వడ్డేశ్వరం లక్ష్మణ్, గొడవర్తి శ్రీనివాసరావు, చంద్రరావు, కృపాకర్, వడ్డేశ్వరం రవి, చిలువూరి కరుణాకర్, బుల్లా ఏసుబాబు, షేక్ మీరషా, బాబు, చిలువూరి సాంబయ్య పాల్గొన్నారు.

- తాడేపల్లి పట్టణ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినికి మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయాన్ని ప్రకటించి ఆదివారం తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ తాడేపల్లికి చెందిన ఇందేటి దేవరాజు, అంజలి దంపతుల ద్వితీయ కుమార్తె ఇంజేటి పుష్పశ్రీ ఇంటర్మీడియట్‌లో 886 మార్కులు సాధించిందని తెలిపారు. ఉన్నత చదువులు చదవాలన్న ఆమె ఆశలకు వారి పేదరికం అడ్డుగా నిలుస్తోందన్న విషయాన్ని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించిన ఆయన రూ.30 వేలను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపోతుల దుర్గారావు, అడిపి యాకోబు పాల్గొన్నారు.



మంగళగిరిలో చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరిలో ఐదుగురికి బండ్ల పంపిణీ

మంగళగిరి: నగరంలోని పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మూడు టిఫిన్ బండ్లు, రెండు తోపుడు బండ్లను అందజేశారు. నగరానికి చెందిన చిరు వ్యాపారులు షేక్ జనితున్నీసా, నేలటూరి సూరమ్మ, ఎస్. నాగూర్ బాషాకు టిఫిన్ బండ్లను, కాకాని చిట్టెమ్మ, చింతల రామకృష్ణకు తోపుడు బండ్లను ఆదివారం నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. అడిగిన వెంటనే తమకు బండ్లు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కేకు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, మహిళా నేతలు మల్లవరపు సుధారాణి, సంకె సునీత పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజంటేటివ్ ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మెడికల్ రిప్రజంటేటివ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఆదివారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. యస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం..తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం, తాళ్లపూడికి చెందిన నిట్టా రాజేష్ (28) 2014లో వివాహం చేసుకుని భార్య అరుణతో కలసి తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్ 20వ లైన్‌లో నివాసముంటూ విజయవాడలో మెడికల్ రిప్రజంటేటివ్‌గా పని చేస్తున్నాడు. మెడికల్‌కు సంబంధించి వ్యాపారం చేయగా అందులో నష్టం రావడంతో ఆర్థికఇబ్బందులు ఏర్పడ్డాయి. భార్య అరుణ కుమార్తెతో కలసి పుట్టింటికి వెళ్లింది. ఈ సమయంలో రాజేష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శనివారం సాయంత్రం నుంచి బయటకు రాకపోవడంతో ఇంటి ఓనర్‌కు అనుమానం వచ్చి కిటికీలు పగలకొట్టి చూశాడు. రాజేష్ ఉరి వేసుకుని కనిపించడంతో భార్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ వినోద్ తెలిపారు.